
# వెండి పట్టాలు

తుంగల మాధవి

సాయంకాలపు నీరెండ గుడిసె చిల్లుల్లో నుండి అక్కడక్కడా పడుతుంది. పొయ్యి దగ్గర కూర్చుని గంజి వారుస్తున్న నాగమల్లి గుడిసెకున్న చిల్లుల్ని లెఖ్ఖపెడుతోంది.






'ఎండకేకానీ.. వానొస్తే ఎందుకూ పనికిరాదు ఈ కొంప.' మనసులో అనుకుంది. మేడలు, మిద్దెలు కట్టుకోవటానికి అయ్య దగ్గర డబ్బులేదుగా. పదహారేళ్ళగా నాగమల్లికి యిప్పుడిప్పుడే లోకం అర్థమవుతుంది.

అమ్మ కాలమ్మ, అయ్య రాజయ్య కూలిపనులకు పోతారు. వచ్చే కూలిడబ్బులతో అమ్మ అయ్య తమ్ముడు, తను బతకాలి. తమ్ముడు సూరీడు బడికి పోతాడు. ఐదోతరగతి వరకూ చదివిన నాగమల్లి యింటిపనులు చేయటానికి బడి మానేసింది.

పొయ్యి మీదనుండి అన్నంకుండ దించి పప్పు సట్టిపెట్టింది. పప్పుపులుసు వండితే సరిపోతుంది అనుకుంటూ మూలనున్న చీపురు తీసి యిల్లు శుభ్రంగా ఊడ్చింది. దీపంగ్లాసు శుభ్రం చేస్తూ ఆలోచిస్తుంది. యింటి పరిస్థితులు తనకి తెలుసు కాబట్టి మేడలు, మిద్దెలు, కారులు అలాంటి కోరికలు తనకేమీ లేదు. కానీ పదిరోజుల క్రితం రాజ్యం కాళ్ళకున్న వెండి పట్టాలు పదేపదే గుర్తుకొస్తున్నాయి. రాజ్యం తన కాళ్ళవైపు చూపిస్తూ ''ఒసే నాగమల్లీ మా అన్నయ్య పట్నంనుండి పండక్కి నాకీ పట్టాలు తెచ్చాడు. నువ్వు కూడా మీ అయ్యకు చెప్పి వెండి పట్టాలు కొనిపించుకోవే నీ కాళ్లకు చాలా బాగుంటాయి.'' అని సంబరంగా చెప్పింది. రాజ్యం, తనూ చాలా స్నేహంగా ఉంటారు. తమకి నాలుగిళ్ళవతలే వాళ్ళిల్లు. 'అయ్య వచ్చిన తర్వాత వెండిపట్టాలు కొనిపెట్టమని అడగాలి' అనుకుంటూ పని ముగించింది. ఆటల కెళ్ళిన సూరీడు ''అక్కా ఆకలేస్తంది. అన్నంపెట్టు'' అంటూ వచ్చాడు.

దీపం ఒత్తి పెద్దది చేసి ఆడికి అన్నం పెట్టి పొంత కాగులో నీళ్ళుపోసి పొయ్యి ఎగదోసి వచ్చికూచుంది. ఈలోపు అమ్మ, అయ్య రానేవచ్చారు. వాళ్ళిద్దరి స్నానాలూ అయ్యేటప్పటికి సూరీడు నిద్రపోయాడు. వాడికి మెడవరకూ దుప్పటికప్పి ముగ్గురికీ అన్నాలు పెట్టింది.

రాజయ్య ఎంగిలి చెయ్యి కడుక్కుంటూ ''మల్లెమ్మా పప్పుపులుసు బాగుంది.'' మెచ్చుకుంటూ అన్నాడు.

''అదేం వండినా రుసిగానే ఉంటది'' అంటూ అమ్మ పళ్ళాలు కడగటానికి వెళ్ళింది.

యిదే మంచి సమయం అనుకొని వెళ్ళి అయ్య పక్కలో కూచుంది. నాగమల్లి.

''మల్లెమ్మా! నిద్రరాలేదా'' కూతురి తల నిమురుతూ అడిగాడు రాజయ్య. ''అయ్యా మరే..'' అంటూ ఆగిపోయింది నాగమల్లి.

''ఏంటో చెప్పవే..నసుగుతావేంటి?'' తోమిన పళ్ళాలు యింట్లోకి తెస్తూ అంది నూకాలమ్మ.

''అయ్యా రాజ్యంలేదూ వాళ్లన్నయ్య మొన్న పండక్కి దానికి వెండిపట్టాలు తెచ్చాడు. చాలా బాగున్నాయి. నాక్కూడా కొనవా.'' అడిగింది నాగమల్లి.

కూసేపు కూతురి తలనిమురుతూ ఉండిపోయాడు రాజయ్య. కొంచెంసేపు ఆలోచించి ''మల్లెమ్మా నేను, మీ అమ్మ సంపాదించేది మన నలుగురికీ తింటానికే సరిపోటం లేదు. వెండి పట్టాలు అంటే చాలా డబ్బులు అవుతాయి. మనకున్న ఆస్థి అల్లా అరెకరం పొలం. దాన్ని నీ పెళ్ళికి కట్నంగా యివ్వాలి. సూరీడు మగపిల్లాడే కాబట్టి ఆడెలాగోలా బతుకుతాడు. నీ పెళ్ళికి ఈ యిల్లు మంచిగా బాగు చేయించాలి. మనలాంటోళ్ళకి చిన్నిచిన్ని కోరికలు కూడా ఉండకూడదు తల్లీ..'' బాధగా నిట్టూరుస్తూ అన్నాడు. మనసులో మాత్రం ''పిచ్చిపిల్ల ఎప్పుడూ నోరు తెరిసి ఏమీ అడగలేదు. పెట్టింది తిని ఉంటది. అలాంటిది యివాళ వెండిపట్టాలు అడిగితే తనుకొనిపెట్టలేకపోతున్నాడు. అనుకున్నాడు.

''సరే నానా. నిద్రొస్తుంది పడుకుంటాను.'' అంటూ వెళ్లి పడుకుందన్న మాటేగానీ పదేపదే రాజ్యం కాళ్ళకున్న పట్టాలే గుర్తుకొచ్చియి. ఎలాగైనా కొనుక్కోవాలి. ఆలోచిస్తూ ఎప్పటికో నిద్రపోయింది.

మర్నాడు పనంతా ఐనాక రాజ్యం దగ్గరకు వెళ్ళింది నాగమల్లి. మాటల మధ్యలో అడిగింది రాజ్యం. ''ఏమే నాగమల్లే మీ అయ్యని వెండి పట్టాలు కొనమని అడిగావా..'' అని.

''అడిగానే కానీ మా అయ్య మనదగ్గర అంత డబ్బులేదుగా..'' అన్నాడు. నేనే ఎలాగోలా కష్టపడి సంపాదించి కొనుక్కోవాలనుకుంటున్నాను. ఏదైనా ఉపాయం చెప్పవే'' అంది నాగమల్లి.

రాజ్యం కొంచెంసేపు ఆలోచించింది. తర్వాత అంది. పూలకొట్టు ఆదెయ్య ఉన్నాడు కదా. పూలు మాలకడితే రోజుకింతని యిస్తాడు. అడిగిచూడు'' అని సలహా యిచ్చింది.

రాజ్యం సలహా నచ్చింది నాగమల్లికి. ఆదెయ్యని అడిగింది నాగమల్లి. సరేనన్నాడు. ఆరాత్రి అమ్మకి, అయ్యకి చెప్పింది. నాగమల్లి పట్టుదల చూసి వాళ్ళు ముచ్చటపడ్డారు. మర్నాటి నుండి పూలుమాలకట్టి ఆదెయ్య యిచ్చిన డబ్బులు దాయటం మొదలుపెట్టింది. కొంతకాలం గడిచింది. హఠాత్తుగా నూకాలమ్మకి ఒకరోజు విపరీతమైన కడుపునెప్పి వచ్చింది. వెంటనే నూకాలమ్మను ఆసుపత్రికి తీసుకెళ్లాడు రాజయ్య. డాక్టరు పరీక్షచేసి ఆపరేషను చెయ్యాలన్నాడు. యిద్దరి, ముగ్గురి దగ్గర అప్పుచేసి నూకాలమ్మకి ఆపరేషను చేయించాడు రాజయ్య.

''అయ్యా నేను వెండిపట్టాలకని దాచుకున్న డబ్బులు అమ్మ ఖర్సులకి వాడు.'' అంటూ తెచ్చి యిచ్చింది నాగమల్లి.

''వద్దులేవే. నా తిప్పలు నేను పడతాను.'' అన్నాడు రాజయ్య.

''అమ్మకంటే నాకు వెండిపట్టాలు ఎక్కువకాదు తీసుకో అయ్యా.'' అంటూ రాజయ్య చేతిలో పెట్టింది డబ్బులు.

మెల్లగా నూకాలమ్మ ఆరోగ్యం కుదుటపడింది. తనుకష్టపడి దాచిన డబ్బు అమ్మకి, అయ్యకి సాయం చెయ్యటానికి ఉపయోగపడినందుకు చాలా సంతోషంగా ఉంది నాగమల్లికి.

రోజులు గడిచిపోతున్నాయి. రాజ్యం అన్న కొండలుతో నాగమల్లి పెళ్ళి కుదిరిపోయింది.

తనకున్న ఆస్థి అరెకరంపొలం కట్నంగా యిచ్చి కొండలుతో నాగమల్లి పెళ్ళి జరిపించేసాడు రాజయ్య. స్నేహితులుగా ఉన్న నాగమల్లి, రాజ్యంలు యిప్పుడు బంధువులైనందుకు వాళ్ళిద్దరికీ చాలా సంతోషంగా ఉంది.

ఆరోజు కొండలకి, నాగమల్లికి తొలిరాత్రి. పెద్దవాళ్ళు యిద్దర్నీ గదిలోకి తోసి తలుపు గొళ్ళెం పెట్టారు. నాగమల్లిని దగ్గరకు తీసుకోబోతూ చటుక్కున ఆగాడు కొండలు. ఏదోగుర్తుకొచ్చినట్టు తన బ్యాగు దగ్గరకు వెళ్ళి అందులోంచి ఏదో బయటకు తీసాడు. మెల్లగా నాగమల్లి దగ్గరకువచ్చి ఆమె చేతిలో ఒక పొట్లం పెట్టి ''నాగమల్లీ అవి పెట్టుకో'' అన్నాడు.

నాగమల్లి ఆశ్చర్యంగా కొండలు యిచ్చిన పొట్లాం ఊడతీసింది. అవి తెల్లగా మెరిసిపోతున్న వెండిపట్టాలు. ఆనందంగా కాళ్ళకు పెట్టుకుంది. దీనికంతటికీ కారణమైన రాజ్యానికి మనస్సులోనే కృతజ్ఞతలు చెప్పుకుంది. సిగ్గుతో యిష్టంగా కొండలు కౌగిలిలో కరిగిపోయింది.

★